

ఇసుక నిల్వలు తరలించడం సరికాదు

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

ఇసుక నిల్వలను అక్రమంగా తరలించడం సరికాదని ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు అన్నారు. కపిలేశ్వరపురం ర్యాంపు వద్ద వరదల సమయంలో వినియోగదారుల కోసం ఉంచిన నిల్వలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మారిన తర్వాత కూటమి నేతల ప్రోద్బలంతో ఇసుక నిల్వలను రాత్రింబవళ్లు అక్రమంగా తరలిస్తున్నారన్నారు. ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరరావు దీనిపై స్పందించాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇసుకను ఉచితంగా అందజేయాలన్నారు. అప్పటి వరకూ ఇసుక నిల్వలను రక్షించాలన్నారు. ఆయన వెంట ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి, ఎంపిటిసి సభ్యులు, వైసిపి నాయకులు ఉన్నారు.

వంటింట్లో ధరల మంట

- రెట్టింపైన కూరగాయల ధరలు
- ఘాటెక్కిన ఉల్లి
- సామాన్యులకు తప్పని అవస్థలు
- అంగన్‌వాడీలపై అదనపు భారం
- సంక్షేమ విద్యార్థులకూ తప్పని ఇబ్బందులు
- మరింతగా పెరిగే అవకాశం



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కూరగాయల ధరలు కొండెక్కాయి. 50 శాతం ధరలు పెరిగడంతో సామాన్యులు కొనలేని స్థితికి చేరారు. ప్రస్తుత వేసవిలో ఎండలు మండిపోతున్నాయి. మరోవైపు అకాల వర్షాల కారణంగా కూరగాయలు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ కారణంగా దిగుబడులు గణనీయంగా తగ్గిపోవడంతో ధరల పెరుగుదల అనివార్యమైంది. ప్రస్తుతం అన్ని కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. గత రెండు వారాల నుంచి పెరుగుదలలో వ్యత్యాసం కనిపిస్తుంది. ఉత్పత్తి తగ్గిపోవడం, రవాణా నిలిచిపోవడం, కొందరు కత్రిమ కొరతను సష్టించటం కూడా కూరగాయల ధరలు పెరగటానికి కారణమవుతున్నాయి.

పెరిగిన ధరలిలా...

గత రెండు వారాల నుంచి ధరలు బాగా పెరిగాయి. వంకాయలు రూ.60 నుంచి రూ.100, బీర రూ.60 నుంచి రూ.100, బెండ రూ.40 నుంచి రూ.60, చిక్కుళ్ళు రూ.40 నుంచి రూ.80, దొండ రూ.40 నుంచి రూ.60, ఆనపకాయ రూ. 20 నుంచి రూ.40, క్యాబేజీ రూ. 30 నుంచి రూ.40, కాకర రూ.40 నుంచి రూ. 60, టమోటా రూ. 40 నుంచి రూ.60, బంగాళా రూ.30 నుంచి రూ.50, మునక్కాడ ఒకటి రూ.5 నుంచి 15, బీట్‌రూట్ రూ. 40 నుంచి రూ.70కి పెరిగాయి. ఒకపక్క ఎండలు మండుతుండగా మరోవైపు కూరగాయల ధరలు ఆకాశాన్ని తాకడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు లబోదిబోమంటున్నారు. డిమాండ్ పెరగడం, మార్కెట్లకు సరుకు అంతంతమాత్రంగానే వస్తుండడంతో ధరలన్నీ పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. వీటి ప్రభావంతో వ్యాపారాలు అంతంత మాత్రంగానే నడుస్తున్నాయని వాపోతున్నారు. కొత్త పంట మార్కెట్ కు వచ్చే వరకూ ఇదే పరిస్థితి కొనసాగవచ్చని చెబుతున్నారు.

మరింత పెరిగే అవకాశం

రైతు బజారు నుంచి గల్లీ దుకాణాల వరకూ కూరగాయల ధరలు కాక పుట్టిస్తున్నాయి. దాదాపు అన్ని రకాల ధరలు మండిపోతున్నాయి. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తోటలు పాడవడంతో కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి. ఏ కూరగాయ రేటు చూసినా కిలో రూ.60 పైగానే ఉంది. దీంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు కూరగాయలు కొనేందుకు జంకుతున్నారు. ఈ ధరలు మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. కూరగాయలు లేకుండా పూట గడవని పరిస్థితిలో వాటి ధరలు ఆకాశాన్నంటడంతో కిలో కొనాలనుకున్న వారు అర కిలోతో సరిపెట్టుకునే పరిస్థితులు నెలకొన్నాయి.

ఘాటెక్కిన ఉల్లి ధరలు

శాఖాహారమైనా, మాంసాహారమైనా ప్రతి ఇంట్లో ఉల్లి తప్పనిసరిగా వాడాల్సి ఉంటుంది. దీంతో ఉల్లికి డిమాండ్ బాగా పెరిగింది. మనకు మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలు నుంచే ఉల్లిపాయలు వస్తున్నాయి. ఇక్కడ రబీలో వేసి ఉల్లి పంటలు అకాల వర్షాలకు దెబ్బతిన్నాయి. దీంతో 50 శాతం వరకూ దిగుబడులు తగ్గిపోవడంతో ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి. రెండు వారాల కిందట వరకూ కిలో రూ.20 నుంచి రూ.25 మధ్య ఉండగా ఒక్కసారిగా రూ.50కు చేరుకుంది. గ్రేడింగును బట్టి ధరలు నిర్ణయిస్తున్నారు. రెండో రకం ఉల్లి రూ.35 ఉండగా మొదటి రకం ధర రూ.50 వరకూ ఉంది. మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నాయి.

అంగన్‌వాడీలపై అదనపు భారం

ప్రభుత్వ మెనూ ప్రకారం గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో నిత్యం ఉదయం అల్పాహారంగా ఉడికించిన కోడి గుడ్లు, సోమవారం నుంచి శనివారం వరకు అన్నం, పులిహోర, ఎగ్ ఫ్రైడ్ రైస్, వెజిటబుల్ రైస్, దోసకాయ, టమోటా, ఆకుకూర, బీరకాయ, సొరకాయ, మునగాకు, పాలకూర, పప్పు కూరగాయలతోపాటు సాంబారు ఇవ్వాలి. బియ్యం, పప్పులు, ఆయిల్ ప్రభుత్వమే అంగన్‌వాడీ కంద్రాలకు సరఫరా చేస్తుంది. అయితే కూరగాయలు, తాలింపు సామాన్లు, గ్యాస్, రవాణా ఖర్చుల కోసం ఒక్కొక్కరికి ప్రభుత్వం కేవలం రూ.5.75 పైసలు మాత్రమే ఇస్తుంది. ప్రీ స్కూల్ పిల్లలకైతే రూ.3 మాత్రమే ఇస్తున్నారు. కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో అంగన్‌వాడీలపై అదనపు భారం తప్పడం లేదు.

అందని పౌష్టికాహారం

ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూ ఛార్జీలు సరిపోని పరిస్థితుల్లో ఎస్‌సి, ఎస్‌టి, బిసి విద్యార్థులకు సరైన పౌష్టికాహారం అందడం లేదు. మరోవైపు కూరగాయల ధరలు రెట్టింపు కావడంతో సంక్షేమ విద్యార్థులు మరిన్ని ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో పౌష్టికాహారం ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వం మెనూఛార్జీలను పెంచడం లేదు. మరో వైపు పెరిగిన ధరలతో కొందరు వార్డెన్లు సతమతమవుతున్నారు. కొన్నిచోట్ల చేసేదేమీ లేక కూరల్లో నాణ్యత తగ్గిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



సిఐటియు మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు ఎవి.నాగేశ్వరావు

పోరాటాలతోనే హక్కుల సాధన

ప్రజాశక్తి-అమలాపురం


దుర్గా ప్రసాద్ జిల్లా అధ్యక్షుడు | నూకల బలరామ్ ప్రధాన కార్యదర్శి | కె.కృష్ణవేణి కోశాధికారి

పోరాటాల ద్వారానే కార్మికులు హక్కులు సాధించుకోగలరని సిఐటియు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎవి.నాగేశ్వరరావు, కె.సుబ్బారావమ్మ పిలుపు ఇచ్చారు. సిఐటియు జిల్లా ప్రథమ మహాసభ అమలాపురం యుటిఎఫ్ ఎంప్లాయిస్ హోమ్‌లో గుదే దుర్గాప్రసాద్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు, సుబ్బరావమ్మ మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ కార్పొరేట్లకు వరాలు, పేదలకు భారాలు తప్పడం లేదన్నారు. కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు పోరాటం ద్వారానే హక్కులు సాధించుకో గలమన్నారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం కార్మికులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేకుంటే పోరాటాలే తప్పవని హెచ్చరించారు. అనంతరం గత రెండు సంవత్సరాల కార్యకలాపాలపై కె.కృష్ణవేణి ప్రవేశపెట్టారు.


హాజరైన నాయకులు, కార్యకర్తలు

సిఐటియు జిల్లా కార్యవర్గం ఎన్నిక

మహాసభలో సిఐటియు జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా గుదే దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా నూకల బలరామ్, కోశాధికారిగా కె.కృష్ణవేణి, ఉపాధ్యక్షునిగా ఎం.భాస్కరరావు, బండి లక్ష్మి, కార్యదర్శిగా సత్యనారాయణ, మలకా సుభాషిణి 42 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. మహాసభలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, సిఐటియు తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు సుందరబాబు, కాకినాడ జిల్లా కోశాధికారి మలకా రమణ, జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కెవివి.సత్యనారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన, భవన నిర్మాణ కార్మికులు, స్కూల్ కంటింజెంట్ వర్కర్లు, విఒఎలు, పలు సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తొలుత మున్సిపల్ కార్యాలయం వెనక ఉన్న సిఐటియు జిల్లా కార్యాలయ భవనాన్ని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరావు ప్రారంభించారు తొలుత సిఐటియు కార్యాలయం నుంచి యుటిఎఫ్ ఎంప్లాయిస్ హోమ్ వరకూ ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో విత్తనాల రాంబాబు, విప్పర్తి మోహన్ రావు, పోలమూరు శ్రీనివాసరావు, నరేంద్ర, నేదునూరి లవరాజు, పరంధామయ్య, కుసుమ ఆదిలక్ష్మి, అమూల్య పాల్గొన్నారు.

డిఎస్‌సిలో వికలాంగులకు పోస్టులు కేటాయించాలి

ప్రజాశక్తి - ఆలమూరు

ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు మొట్టమొదటి సంతకంతో ప్రవేశపెట్టిన మెగా డిఎస్‌పిలో వికలాంగ విద్యార్థులకు ప్రత్యేకంగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని సామాజిక కార్యకర్త, ల్యాంప్ స్వచ్ఛంద సేవా సంస్థ కో ఆర్డినేటర్ బడుగు సుబ్బాయమ్మ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆమె మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. గడచిన 24 ఏళ్ల నుచి ఆమె చేస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా పాఠశాలల్లో బోధన విషయంలో రాష్ట్రంలోని వికలాంగ్ విద్యార్థులు పడుతున్న అనేక ఇబ్బందులను చాలా దగ్గర నుంచి చూశానన్నారు. పాఠశాలలో వారి నిమిత్తం ప్రత్యేక పాధ్యాయులు ఎవరూ లేరని, వికలాంగ పిల్లలు సమ్మిళిత విద్యకు తగు సౌకర్యాలు లేక విద్యకు దూరమై, మానసిక ఇబ్బందులకు గురవుతూ విద్యా ప్రగతిని భవిష్యత్తును కోల్పోతున్నారన్నారు. ఎన్‌ఇపి 2020 ప్రకారం ప్రతి పాఠశాలలో ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించవలసి ఉందన్నారు. కాబట్టి మెగా డిఎస్‌సిలో ప్రత్యేక పోస్టులను కేటాయించాలని ఆమె రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. దీంతో వికలాంగ విద్యార్థులకు బంగారు భవిష్యత్తును ఏర్పాటు చేసిన వారవుతారని ఆమె సూచించారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ ప్రత్యేక ఉపాధ్యాయుల ఫెడరేషన్ ద్వారా బడుగు మహిమ రావు, మల్లిడి సాయి లక్ష్మి, రవి ప్రసాద్ మంగళగిరిలోని ప్రజా దర్బార్‌లో విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను కలిసి వికలాంగ విద్యార్థుల సమస్యలను వివరించారు. వారి నిమిత్తం ప్రత్యేక పోస్టుల కోసం ఎదురు చూస్తున్నట్లు వారు కోరారు. దీనపై ఆయన సానుకూలంగా స్పందించి తగిన ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారన్నారు.


మంత్రి లోకేష్‌కు వినతి పత్రం ఇస్తున్న సభ్యులు


పాపారావు, సతీష్‌కు యూత్ సభ్యుల సత్కారం

ఘనంగా కూటమి విజయోత్సవాలు

ప్రజాశక్తి - ఆలమూరు

రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి, కొత్తపేటలో టిడిపి ఎంఎలఎగా బండారు సత్యానందరావు సంచలన విజయం సాధించిన సందర్భంగా కొత్తూరు సెంటర్ శ్రీవిఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో సోమవారం వేడుకలు నిర్వహించారు. శ్రీమురళీకృష్ణ సంస్థల అధినేత వంటిపల్లి పాపారావు, టిడిపి సీనియర్ నేత వంటిపల్లి సతీష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత మండల కేంద్రంలోని పాపారావు నివాసం నుంచి బాణసంచా కాలుస్తూ కొత్తూరు సెంటర్ రామాలయం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా యూత్ సభ్యులందరు పాపారావు, సతీష్‌ను ఘనంగా సత్కరించారు. భారీ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇంతటి ఘన విజయాన్ని అందించిన నియోజకవర్గ కూటమి నాయకులకు, కార్యకర్తలకు, మురళీకష్ణ సంస్థల్లో పని చేస్తున్న కార్మికులకు, మహిళలకు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా వెంకన్న కల్యాణోత్సవం

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని గుమ్మిలేరులోని శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవం కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. 36వ వార్షిక వేడుకల్లో భాగంగా ముందుగా స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం ఆలయ ప్రధాన అర్చకులు విజయకుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు పూర్తి చేశారు. గ్రామానికి చెందిన గుణ్ణం త్రిసోను, శ్రీసంయుక్త దంపతులు స్వామివారి కల్యాణోత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు.

కుక్కుటేశ్వరరావు సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

విద్య వైద్యంతో పాటు పేదలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేసిన కుక్కుటేశ్వరరావు సేవలు ఆదర్శనీయమని జెడ్‌పిటిసి గెడ్డం సంపదరావు అన్నారు. భీమనపల్లి పంచాయతీ సూదాపాలెంకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ డిసిసిబి ఛైర్మన్ శిరంగు కుక్కుటేశ్వరరావు మూడో వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. భట్టుపాలెంలోని కుక్కుటేశ్వరరావు విగ్రహానికి సర్పంచులు పెయ్యల రాజ్‌కుమార్, జిన్నూరి వెంకటేశ్వరరావు, జెడ్‌పిటిసి సంపదరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పేదల కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి శిరంగు రాజా నాయకులు నల్లా విష్ణుమూర్తి, శిరంగు సత్తిరాజు, జంపన బాపిరాజు, ఇళ్ల కృష్ణ, రాయపురెడ్డి నాగు, కోలపల్లి పట్టాభి, మట్టపర్తి బులిస్వామి, నూకల బాబు, గంధం బ్రహ్మానందం, ఆకేటి రాముడు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షునిగా పవన్

ప్రజాశక్తి-కొత్తపేట

ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షునిగా ఎండ్లూరి పవన్ కుమార్ ఎన్నికైనట్టు ఆర్యవైశ్య సంఘం మండల శాఖ అధ్యక్షుడు శ్రీకాకుళం లక్ష్మీనారాయణ (బాబి) తెలిపారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పవన్ మండల శాఖ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు సత్యవరపు జమిందార్, డాక్టర్ పచ్చిపులుసు కృష్ణారావు, గమ్మిడి ఆనంద్, తమ్మన సాయి ప్రసాద్, ఎన్‌ఎస్‌యుకె రామలింగేశ్వరరావు, శ్రీకాకుళపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో ఎండూర్ పవన్ ఎన్నికయ్యారు తన గెలుపునకు కృషి చేసిన శ్రేఘాకోళ్లపు చిన్ని (సుబ్బారాయుడు) కొత్త చినబాబులు, సత్యవరపు రామారావు, కొత్త జగన్నాథం, నంబూరి పవన ప్రసాద్, సత్యవరపు రాంబాబు, కొత్త సతీష్ కుమార్ గుప్తా తదితరులకు పవన్ కతజ్ఞతలు తెలిపారు.

కార్టూ'నిజం'




డ్రైవర్లకు యూనిఫారం పంపిణీ చేస్తున్న మంత్రి సుభాష్

ఘనంగా మంత్రి సుభాష్ పుట్టినరోజు

ప్రజాశక్తి-రామచంద్రపురం

కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పుట్టినరోజు వేడుకలు అభిమానుల సమక్షంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ద్రాక్షారామంలోని పేపకాయల బాబ్జి కళ్యాణ మండపంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని కేక్ కట్ చేశారు. తొలుత రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో మంత్రి పలు కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా వెయ్యి మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలో పలుచోట్ల మొక్కలు నాటారు. అభిమానులు ద్రాక్షారామం కె.గంగవరంలోని శివల గ్రామంలోనూ రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఆటో డ్రైవర్లకు యూనిఫారం పంపిణీ చేశారు.


భక్తి శ్రద్ధలతో బక్రీద్ ప్రార్థనలు

జిల్లావ్యాప్తంగా ముస్లిములు సోమవారం బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారున . మసీదుల్లో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఒకరికి ఒకరు శు భాకాంక్షలు తెలుపుకున్నారు.

ప్రజాశక్తి -యంత్రాంగం

మామిడికుదురు బక్రీద్ పండుగను నగరం పరిసర ప్రాంతాల్లో ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. మండల కేంద్రమైన మామిడికుదురులోని షియా జామియా మసీదు, సున్నీ జామియా మసీదుల్లో నమాజు నిర్వహించారు. మత ప్రబోధకులు మొహమ్మద్ ఇబ్రహీం, తారిక్ అన్వర్ రజ్వీ బక్రీద్ ప్రాశస్యాన్ని వివరించారు. మొగలికుదురు మసీదులో మొహమ్మద్ ఇబ్రహీం, నగరం పెద్ద ఫంజిష మసీదులో హెబాతుల్ హుస్సేన్, మాజేంద్రాని నమాజు చేశారు. కమిటీ నాయకులు ఆబేద్ అలీ, కిశ్వర్ అబ్బాస్కాజారాణి, మసూద్ మోహిద్దీన్, కల్ బే ఆబేద్, ఇంద్రాణి, అసదుల్లా మసద్ది, సర్కిల్ కల్బే అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎంఎల్‌ఎ గొల్లపల్లి సూర్యారావు మసీదుకు వచ్చి ముస్లిములకు శుభాకాంక్షలు తెలిపారు. పెదపట్నం, కొమరాడ, మగటపల్లి గ్రామాల్లోని మసీదుల్లో బక్రీద్ పండుగ నమాజులు జరిగాయి.


మామిడికుదురులో..


రామచంద్రపురంలో..


ముమ్మిడివరం మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు

రామచంద్రపురం ద్రాక్షారామంలోని షియా జామియా జాఫరీ మసీదులో మత గురువు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మత గురువు హజరత్ హుస్సేన్, హజరత్ ఇబ్రహీం బక్రీద్ ప్రాముఖ్యతన వివరించారు. మౌలానా మీర్జా ఆస్కరి హుస్సేన్ ఈద్ ప్రార్థన గురించి వివరించారు. అనంతరం తమ పూర్వికుల సమాదుల వద్దకు వెళ్లి శ్రద్ధాంజలి ఘటించారు.

ముమ్మిడివరం బక్రీద్ వేడుకలను అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని గొల్లగూడెం మసీదులో మత గురువు షియా మసీద్ మౌలానా మహమ్మద్ తఖి నమాజు చేసి ఈద్ సారాంశాన్ని వివరించారు. ఈ సందర్భంగా ప్రతి ముస్లిం దయా గుణాన్ని అలవర్చుకుని నిస్సహాయులైన పేద వారిని ఆదుకోవాలని చెప్పారు. పవిత్ర గుణం కలిగి సమాజ శ్రేయస్సు కోసం పాటు పడాలని, ఇస్లాం ప్రేమ సందేశాన్ని ప్రపంచానికి చాటాలని సూచించారు. బక్రీద్ సందర్భంగా మసీదులు భక్తులతో కళ కళలాడాయి. అనంతరం తేనీటి పానీయాన్ని పంచారు. మసీదులను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

కపిలేశ్వరపురం మండలంలోని పలు గ్రామాల్లో బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగరలోని మస్ జిద్ ఎ- ఇబ్రహీమాలో ఈద్ ప్రార్థనలు నిర్వహించారు. మస్జిద్ ఎ- ఇబ్రహీమా మతవల్లి మహమ్మద్ అబ్బాస్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఇమామ్ మౌలానా మహమ్మద్ నాజీం అక్తర్ బక్రీద్ విశిష్టతను వివరించారు. ఈద్ ప్రార్థనల అనంతరం ఒకరినొకరు అలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. ఈ సందర్భంగా స్వీట్స్ స్వీకరించి పూర్వీకుల మసీదులను సందర్శించి దువాలు, ప్రార్థనలు, చేశారు. ఈ కార్యక్రమంలో అంగర గ్రామంతో పాటు పడమర ఖండ్రిగ, వెదురుమూడి, కపిలేశ్వరపురం, నల్లూరు, వల్లూరు పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ముస్లిములు పాల్గొన్నారు.

కొత్తపేట త్యాగనిరతికి ప్రతీక బక్రీద్ అని కొత్తపేట ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు అన్నారు. బక్రీద్ పర్వదినం. దైవ ప్రవక్త ఇబ్రహీం త్యాగాన్ని స్మరించుకుంటూ జరుపుకుంటున్న పండుగ అనప్పారు. ముస్లిం సోదరులకు వారి కుటుంబ సభ్యులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా మహా గజమాల యాత్ర

ప్రజాశక్తి -మామిడికుదురు

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అయిన అప్పనపల్లి బాల బాలాజీ స్వామి ఆలయంలో ఏటా తిరు కళ్యాణోత్సవం సందర్భంగా ఆలయ నిర్మాత మొల్లేటి రామస్వామి, ఆదిలక్ష్మి దంపతుల విగ్రహాలకు భారీ గజమాల అలంకరించడం పరిపాటి. ఈ సందర్భంగా రామస్వామి శత జయంతిని పురస్కరించుకుని రాజోలు తాలూకా శెట్టిబలిజ సంక్షేమ సంఘం, తాలూకా యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం మహా గజమాల యాత్రను నిర్వహించారు. గ్రామాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి గజ మాల యాత్రలో యువత భాగస్వామ్యం అయ్యేలా ప్రణాళిక సిద్ధం చేసారు. గ్రామ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు, ముఖ్య నాయకులను కలిసి ఆహ్వాన పత్రికలు అందజేసి యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గజమాల యాత్రలో పాల్గొన్న వారికి భోజన వసతి కల్పించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై భారీ గజమాలను ఏర్పాటు చేశారు. కేరళ వాయిద్యాలు, డిజె, బాణసంచా కాల్పులతో భారీ జన సందోహం నడుమ యాత్ర సాగింది.. తాటిపాకలోని శెట్టి బలిజ సంక్షేమ భవనం వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. నగరం, మామిడికుదురు, పాశర్లపూడి మీదుగా అప్పనపల్లికి యాత్ర చేరుకుంది. అప్పనపల్లి ఆలయ ప్రాంగణంలో ఉన్న ఆలయ నిర్మాత మొల్లేటి రామస్వామి, ఆదిలక్ష్మి దంపతుల విగ్రహాలకి భారీ గజమాల అలంకరించారు. ఈ కార్యక్రమంలో కొల్లేటి శ్రీనివాస్, చెల్లబోయిన శ్రీనివాస్, బొక్కా పెద్దిరాజు, పాటి గోవిందరావు, వివిఎస్ఎన్.మూర్తి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో హెచ్‌సికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని వెంకటకృష్ణ రాయపురం - మాధవపట్నం మధ్య సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాకినాడ ఎస్‌పి కార్యాలయంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శంకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కాకినాడ నుంచి సామర్లకోట భీమేశ్వర ఆలయంలో దర్శనం అనంతరం ఆయన ద్విచక్రవాహనంపై తిరిగి కాకినాడకు బయలుదేరాడు. ఈ సమయంలో కాకినాడ నుంచి రాజమహేంద్రవరం వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. కారులో ఉన్న ఒక మహిళ గాయపడింది. హెచ్‌సి శంకర్‌ను మాధవపట్టణంలోని ట్రస్ట్ ఆసుపత్రికి తరలించారు. అలాగే గాయపడిన మహిళను చికిత్స నిమ్మిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేశారు.

95 మద్యం బాటిళ్ల స్వాధీనం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

గొల్లవిల్లి ఎన్‌టిఆర్ కాలనీలోని ఒక ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 95 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తమకు అందిన సమాచారం సోమవారం రాత్రి దాడి చేసి పట్టుకున్నామని ఎస్‌ఐ ఎన్‌ఎం.జోషి తెలిపారు. ఇంటి యజమాని ఈతకోట పల్లం రాజును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.


వికలాంగులకు సాయం అందిస్తున్న మంత్రి సుభాష్

వికలాంగులకు మంత్రి రూ.లక్ష సాయం

ప్రజాశక్తి-రామచంద్రపురం

రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పుట్టినరోజు సందర్భంగా ద్రాక్షారామలోని శెభాష్‌పేటలో సోమవారం వికలాంగులకు రూ.లక్ష సాయం అందించారు. ఎన్నికల ప్రచారంలో ఆయన అంగవైకల్యంతో బాధపడుతున్న ఇద్దరు చిన్నారులు కర్రి నాగేశ్వరావు, ఆళ్ల బుజ్జికి ప్రతి పుట్టినరోజుకీ రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేస్తానని హామీ ఇచ్చారు. మొదటి సంవత్సరంగా మంత్రి వికలాంగుల ఇంటికి వెళ్లి రూ.లక్ష వారి తల్లికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అందేందుకు కృషి చేద్దామని, ఎవరికి ఏ ఆపద వచ్చినా తాను ముందు ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో, నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.


క్రీడా కిట్లు అందిస్తున్న ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు

క్రీడా నైపుణ్యాలను యువత పెంచుకోవాలి

ప్రజాశక్తి-ముమ్మిడివరం

యువత క్రీడా నైపుణ్యాలను పెంచుకోవాలని ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు అన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని నాలుగో వార్డు మార్కెట్ ప్రాంతానికి చెందిన బేడ బుడగ జంగాల యూత్, వార్డు ఇన్‌ఛార్జి కాకి మాణిక్యం ఆధ్వర్యాన ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో సుబ్బరాజును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ సుబ్బరాజు వారికి క్రికెట్ కిట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో దాట్ల పృథ్వీరాజ్, పట్టణ టిడిపి అధ్యక్షుడు దొమ్మేటి రమణ కుమార్, ఉప్పు సుబ్బారావు, కళ్యాణి మావుళ్ళ, విజయ్ చెన్నూరి, మరిడియ్య, ముగ్గ కాసులు, ఏడుకొండలు, నేర్లగంటి సాయి పాల్గొన్నారు.

ఇపిఎఫ్ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కాకినాడ

ఇపిఎఫ్ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సమావేశంలో ఎన్‌ఎ.శాస్త్రి అధ్యక్షతన యుటిఎఫ్ హోమ్‌లో సోమవారం జరిగింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు కార్యక్రమాల నివేదికలను, తీర్మానాలను ప్రవేశపెట్టారు. 9వ తేదీన అఖిలభారత కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశంలో నిర్ణయించిన తీర్మానాలను సభలో వివరించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన పార్లమెంటు సభ్యులకు ఇపిఎఫ్ పెన్షనర్ల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల సమస్యలపై విజ్ఞాపన పత్రాలు అందించాలన్నారు. రాష్ట్రంలో పెన్షనర్లందరికీ బకాయిలు వెంటనే చెల్లించాలని, ఇపిఎఫ్ పెన్షనర్లకు కనీస పింఛను రూ.9వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు నెలలో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపడుతున్నారన్నారు. దీన్ని జయప్రదం చేయాలని కోరారు. రైలు ప్రయాణాల్లో సీనియర్ సిటిజన్లకు సబ్సిడీ కల్పించాలన్నారు. రాష్ట్రంలో ఇపిఎఫ్ పెన్షనర్లందరికీ సామాజిక పెన్షన్ రూ.4వేలు చెల్లించాలన్నారు. హైయ్యర్ పెన్షన్ కోసం హైయ్యర్ ఆప్షన్ అందరికీ అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్లు అందరికీ పిఆర్‌సి బకాయిలు, డిఎ బకాయిలు వెంటనే చెల్లించాలని తీర్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్లు అందరికీ జులై 2023 డిఎ వెంటనే మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో శ్రీకాకుళం జిల్లా నుంచి ఆదినారాయణమూర్తి, విశాఖ జిల్లా నుంచి కె.సుధాకరరావు, కెపి.కుమార్, దీనబంధు, కె.రమణమూర్తి, కర్రి బాబూరావు, జార్జ్, రామదాసు, మోహన్‌రావు, కృష్ణారావు, అజయ్ కుమార్, శేషయ్య, చంద్రమౌళి, వై.సత్యనారాయణ, ఎంవి.రాఘవులు, యుఎస్‌ఎన్.రెడ్డి, జోగా అప్పారావు పాల్గొన్నారు.


సత్యనారాయణరాజుకు నివాళులర్పిస్తున్న నాయకులు

సత్యనారాయణరాజు సేవలు చిరస్మరణీయం


ఆంధ్రప్రదేశ్ లో పెన్షనర్ల ఉద్యమంలో చక్కన సత్యనారాయణరాజు సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర అధ్యక్షులు ఎన్‌ఎ.శాస్త్రి కొనియాడారు. రాష్ట్ర కమిటీ సమావేశం నేపథ్యంలో తొలుత అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి సిహెచ్.సత్యనారాయణరాజు సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపిఆర్‌పిఎ ఆవిర్భావం నుంచి సత్యనారాయణరాజు రాష్ట్ర కోశాధికారిగా పని చేశారన్నారు. అత్యంత నిజాయితీగా నిబద్ధతతో బాధ్యతను నిర్వర్తించారన్నారు. పెన్షనర్ల ఉద్యమంలో చాలా చురుకైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎపిఆర్‌పిఎ నిర్మాణంతోపాటు చురుకైన కార్యకర్తలను ఉద్యమంలోకి తీసుకొచ్చారని అన్నారు. అందరూ పెన్షనర్లు ఉద్యమంలో పాల్గొనడమే వారికి ఇచ్చే ఘన మైన నివాళి అని అన్నారు.

వైభవంగా బాలబాలాజీ కల్యాణోత్సవం

ప్రజాశక్తి -మామిడి కుదురు

అప్పనపల్లి బాల బాలాజీ స్వామి కళ్యాణ మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తొలుత గరుడ వాహనంపై తిరువీధి ఉత్సవం నిర్వహించారు. శ్రీవాణి మహిళా సత్సంగ మిత్ర బృందం లలిత విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. తాడేపల్లిగూడెం ఆచంటకు చెందిన చిన్నారుల కోలాట భజన కార్యక్రమం ఆకట్టుకుంది. వ్యాఖ్యాత రెడ్డప్ప స్వామి వారి చరిత్రను వివరించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. బాల బాలాజీ స్వామివారి పద్మావతి అమ్మవార్ల రాయబారోత్సవాలు చలమచర్ల మురళీ కృష్ణమాచార్యులు, గొడవర్తి శ్రీనివాస్, ముఖ్య అర్చకులు కళ్యాణోత్సవాల విశిష్టతను వివరించారు.


స్వామి వారి ఉత్సవ విగ్రహాలు


కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఆర్‌జెసి కె.సుబ్బారావు దంపతులు

సుమారు 315 మంది కల్యాణ కర్తలతో స్వామి వారి కళ్యాణ ఉత్సవం ఘనంగా నిర్వహించారు దేవస్థానం తరపున ఆలయ కమిషనర్ గ్రంధి మాధవి, ప్రభుత్వం తరపున ఆర్‌జెసి కె.సుబ్బారావు స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఉప కమిషనర్ ఎం.విజయ రాజు, ఎస్‌పి ఎస్.శ్రీధర్, డిఎస్‌పి కెవి.రమణ, అంతర్వేది ఎసి వి.సత్యనారాయణ, వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఎసి కిశోర్ కుమార్ ఆయా ఆలయాల తరపున స్వామివారికి పట్టు వస్త్రాలు అందజేశారు. బాల బాలాజీ దేవ దేవస్థానం మాజీ చైర్మన్ మొల్లేటి శ్రీనివాస్, చిట్టూరి రామకృష్ణ, ఎంపిపి కె.వనజకుమారి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు కంకిపాటి నరసింహారావు, పాటి గోవిందరావు కళ్యాణోత్సవాన్ని తిలకించారు.


భూషణంకు నివాళులర్పిస్తున్న బిఎస్‌పి నాయకులు

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఇటీవల కృష్ణా జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎస్.యానాంకు చెందిన ఇద్దరు మృతి చెందారు. ఆ కుటుంబాలను సోమవారం అమలాపురం నియోజకవర్గ బిఎస్‌పి ఇన్‌ఛార్జి పొలమూరి మోహన్ బాబు, ఆ పార్టీ నాయకులు పరామర్శించారు. మృతుడు రేవు భూషణం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబా లకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఏ ఆపద వచ్చినా ఆదుకునేందుకు బిఎస్‌పి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో బిఎస్‌పి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కోలా త్రిమూర్తులు, ముత్తాబత్తుల శ్రీనివాస్, కొంకి ప్రకాశరావు, వెర్రబ్బాయి, పి.రాంబాబు పాల్గొన్నారు.


మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

మంత్రి సుభాష్‌ను కలిసిన అధికారులు

ప్రజాశక్తి-రామచంద్రపురం

కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పుట్టిన రోజు సందర్భంగా రామచంద్రపురం మండల పరిషత్ అధికారులు సోమవారం మంత్రిని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారంతా పరిచయం చేసుకుని అభినందనలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఎంపిడిఒ ఎన్‌వి.రామచంద్ర మూర్తి, ఎఒ జివిఆర్.సుబ్రహ్మణ్యం, ఇఒపిఆర్‌డి సెలట్ రాజు. సీనియర్ అసిస్టెంట్ కె.లాజర్ సిబ్బంది ఉన్నారు.

మందేశ్వర స్వామిని దర్శించుకున్న కమిషనర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-కొత్తపేట

రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్ కుటుంబ సమేతంగా శ్రీ పార్వతీ సమేత మందేశ్వర స్వామిని సోమవారం సాయంత్రం దర్శించుకున్నారు. వీరికి దేవస్థాన అర్చకులు, వేదపండితులు, సిబ్బంది స్వాగతం పలికారు. వేదమంత్రాల నడుమన దర్శనం చేయించారు. అనంతరం స్వామి వారి శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదాలను అందజేసినట్లు ఆలయం ఇఒ కె.విజయలక్ష్మి తెలిపారు.

పేదలకు పట్టాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని గుర్రప్పాలెం గ్రామంలో గత 20 సంవత్సరాలుగా సీలింగ్ భూమిని సాగు చేసుకుంటున్న నిరుపేదలకు పట్టాలు మంజూరు చేయాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం గుర్రప్పాలెంలో రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సీలింగ్ భూమి కోసం ఆందోళన కార్యక్రమాలు చేపట్టామని, ఈ ఆందోళనకి కలెక్టర్ స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆర్‌డిఒను ఆదేశించారని అన్నారు. 16 రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని చెప్పి ఆయన 7 నెలలు గడుస్తున్నా సమస్య పరిష్కారం చేయలేదన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి సాగుదారులకు పట్టాలను మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కడితి సతీష్, కుంచె అంజిబాబు, సురేష్, చిన్న , తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న రైతు కూలీసంఘం నాయకులు, కార్యకర్తలు

అక్రమ నిర్మాణాలపై టిడిపి ధర్నా

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఏలేశ్వరం నుంచి ఎర్రవరం వైపు వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు సమీపంలో అక్రమ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలను నిలుపుదల చేయాలని టిడిపి శ్రేణులు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి గొల్లపల్లి బుజ్జి, కౌన్సిలర్ బొద్దిరెడ్డి గోపి మాట్లాడుతూ 500 కెవి హైపర్ టెన్షన్ విద్యుత్ వైర్ల కింద వైసిపి నాయకుడు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు చేపడుతున్నారని అన్నారు. హైపర్ టెన్షన్ లైన్ కింద నిర్మాణాలను నిలుపుదల చేయాలని గతంలోనే స్థానికులు పవర్ గ్రిడ్ అధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. ఆ నిర్మాణాలను నిలుపుదల చేయాలని సంబంధిత శాఖ అధికారులు మే నెలలోనే మండల పరిషత్ అధికారికి ఆదేశాలు జారీ చేశారన్నారు. అయినా అక్రమ నిర్మాణాలను నిలపుదల చేయలేదని చెప్పారు. సంఘటనా స్థలానికి ఎంపిడిఒ అరుణకుమారి, పెద్దాపురం డిఎస్‌పి లలితకుమారి తమ సిబ్బందితో చేరుకుని ఉన్నతాధికారులకు తెలియజేయడంతో తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు నిర్మాణాలను నిలుపుదల చేయాలని జిల్లా అధికారులు ఆదేశాల జారీ చేశారు. దీంతో వారు ఆందోళనను విరమించారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున టిడిపి కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

తిరుపతి ఆలయంలో చినరాజప్ప పూజలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలో ఉన్న శృంగార వల్లభ స్వామి ఆలయంలో సోమవారం ఎంఎల్ఎ నిమ్మ కాయల చినరాజప్ప ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాస్, ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణా ఆచా ర్యులు ఆశీర్వచనాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆల య పరిసరాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ తనయుడు నిమ్మకాయల రంగనాగ్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు తుమ్మల రామస్వామి, టిడిపి మండల అధ్యక్షులు కొత్తిం వెంకట శ్రీనివాసరావు, ఎలిశెట్టి నాని, తిరుపతి సర్పంచి మొయిళ్ళ కృష్ణమూర్తి, కొమ్మిరెడ్డి బుజ్జి, బందిలి సుబ్రహ్మణ్యం, మత్తాల రాజు, కొప్పిరెడ్డి నాగబాబు, జట్ల విజయ్ పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న ఎంఎల్ఎ చినరాజప్ప

యానాం వార్తలు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న యానాం కాంగ్రెస్ నేతలు

ప్రజా సమస్యలపై పోరాటం

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరిలో కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించారని దానికి ఇటీవలి జరిగిన లోక్‌సభ స్థాన ఎన్నికల్లో ఆ కూటమి ఘోర ఓటమి నిదర్శనమని యానాం బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్ధాని దినేష్ అన్నారు. సోమవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పుదుచ్చేరి పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి పోటీచేసిన హోంమంత్రి నమశ్శివాయంపై కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి లక్షా 36 వేల ఓట్ల మెజారీతో విజయం సాధించారని అన్నారు. లోక్‌సభ స్థానం పరిధిలో 30 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 28 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ పూర్తి మెజారిటీ సాధించిందన్నారు. యానాంలో సైతం 7 వేల ఓట్లు రావడం ప్రజల ఆదరణకు అద్దం పట్టిందన్నారు. 2026లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. యానాం నియోజకవర్గ ప్రజాసమస్యలపై కాంగ్రెస్ పార్టీ పేదలపక్షాన నిలబడి పోరాడుతుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస వైద్యం అందని పరిస్థితి ఉందని, ఆఖరుకి మార్చురీలో మృతదేహాలు భద్రపరిచేందుకు ఫ్రీజర్ బాక్సులు సైతం వినియోగంలో లేకపోవడం దారుణమన్నారు. జనరేటర్ కొనుగోలుకు ఎంపి నిధులు మంజూరైనా దాని అంచనాలు రూపొందిచడంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా వెనుకకు వెళ్లిపోయాయన్నారు. ఇంతజరుగుతున్నా స్థానిక ఎంఎల్ఎ ఆశోక్, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సైతం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కనకాలపేట డంపింగ్ యార్డ్ సమస్య కురసాంపేట ఇసుక ర్యాంపు మంజూరు, అర్హులైన రికి ఒఎన్‌జిసి పరిహారం అందించాలని తదితర డిమాండ్లపై పోరాటం కొనసాగుతుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు పైడికొండల రాజబాబు, శ్రీమంతుల శ్రీధర్, లంకే జాన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మంత్రికి అభినందనలు తెలుపుతున్న ఎంఎల్ఎ అశోక్

మంత్రి సుభాష్ పుట్టినరోజు వేడుకల్లో ఎంఎల్ఎ అశోక్

ప్రజాశక్తి - యానాం

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పుట్టినరోజు వేడుకల్లో స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పాల్గొన్నారు. మంత్రి సుభాష్‌తో కలిసి సోమవారం నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ అశోక్ మంత్రి సుభాష్‌ను దుస్సాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మీడియాతోమాట్లాడుతూ రాజకీయాల్లోకి రాకముందు నుంచి వాసంశెట్టి సుభాష్, గంధం పల్లం రాజుతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు. సుభాష్ ప్రజలందరికీ అండగా ఉంటాడని అన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

కాకినాడ రూరల్ : ముస్లిం సమాజానికి అత్యంత పవిత్రమైన రోజులలో బక్రీద్ ఒకటని ఇది త్యాగానికి ప్రతీక అని రమణయ్యపేట మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ అన్నారు. ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో బక్రీద్ పండుగ సందర్భంగా పేద ముస్లిం మహిళలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు.